అమృతుడు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

సన్నజాజులపందిరి కళకళలాడింది. ఆ పువ్వులు వాడినా చిక్కని పరిమళం మాత్రం సిగ నంటి పెట్టుకొనే వుంటుంది...జీవితంలో అధ్యాయం మారుతుంది; కోరికలు తీరటంతో ఆసక్తి చప్పబడుతుంది; ఎన్నిసార్లు పెట్టుకొన్నా సన్నజాజులమీది అపేక్ష మాత్రం తగ్గదేమో!...అనుకొన్నది ప్రసూన. ఆమెకు ఆ పువ్వులు దండగ్రుచ్చి జడలో ధరించటం ఒక్కటే పేలవం కాకుండా, క్రొత్తదనం చెరగకుండా నిలిచిన సరదా! అంతకు నాలుగైదేళ్ళ పూర్వం ఆమె భావనాలోకంలో గృహిణి జీవితం అంటే: హోదాగల ఉద్యోగంతో, అనుకూలుడైన, నచ్చినభర్త; కోరిన నగలు, చీరలు; సొంతకారు; కావలసిన తీరిక...... ఆ కోరిక లన్నీ, తీరి, కల నిజమై నిలిచింది; అందరూ అదృష్టవంతురాలి వన్నారు! అప్పుడు ఊహింపనిదీ, తర్వాత తర్వాత లోటుగా తెలిసివస్తూవుండేది. ఒక్కవిషయ మున్నమాట నిజమే: అది తన కింకా మాతృత్వం రాకపోవటం; కాని ఆ విషయంలోకూడా భయపడనవసరం లేదని డాక్టర్లు, జ్యోతిష్కులు అంటున్నారు...పోతే, మిగిలిందేమిటి? అసంతృప్తి! ఎందుకు? కారణం తెలీదు! "ఏమీ తోచదు" అని ఆమె ఎప్పుడైనా అంటే, "నీకు తీరిక ఎక్కువై పోయింది ప్రసూనా!" అంటాడు భర్త..."ఇంకా తల్లివి కాకపోవటమే. కారణం, ఆ పుణ్యకాలం ఎప్పుడు వస్తుందో!" అంటుంది అత్తగారు... "అమ్మాయ్, వేదాంతమూ మతమూ, వీటిమీద కాస్త ఆసక్తి కలిగించుకోరాదూ జీవితంలో అర్థం కనిపిస్తుంది!" అంటాడు తండ్రి... "మహిళాసంఘ కార్యక్రమాల్లో మీరు శ్రద్ధ తీసుకోవాలండీ" అంటుంది కలెక్టరుగారి భార్య, సంఘాధ్యక్షురాలు... కాని ఏ ఒక్క వివరణా, సలహా ఆమెకు నచ్చలేదు; సమస్య తీరటం లేదు. ఎంత తరచినా, అసంతృప్తి స్వరూపం ఒక్కటే- పూర్వం తనకేవిషయమైనా సరే ఆసక్తి అంటూ వుండేది, ఎదురుచూచే ఉత్సాహం వుండేది; ఇప్పుడు అవి రెండూ లేవు! చివరకు తను మాతృత్వాన్నికూడా పెద్దగా ఎదురు చూడటం లేదు!

కారువచ్చి ఆగింది. భర్త వరాండా మెట్లెక్కి వచ్చాడు.

"నువ్వు క్లబ్బుకి వెళ్ళలేదేం యివాళ?" అన్నాడు.

ఒళ్ళోవున్న ఇంగ్లీషు నవల పైకెత్తి చూపింది ప్రసూన. "ఇది చదివెయ్యాలని కూర్చున్నాను."

"మరి చదవకుండా జాజి పందిర్ని చూస్తూ పువ్వులు లెక్క పెడుతున్నావే!"

భర్త చమత్కారానికి ప్రసూన నవ్వింది. "లేదు...కొంత భాగం గడిచేప్పటికి కథ పరుగెత్తటం మాని యీడుస్తూ కుంటటం ప్రారంభించింది. విసుగొచ్చింది."

"జీవితంలాగే?"

ప్రసూన విషయం మార్చింది. "మీ రెందుకని ఇంత తొందరగా వచ్చేశారు క్లబ్బునుంచీ?"

"టెలిగ్రాం వచ్చింది...వేణు వస్తున్నాడు... ఈ ట్రెయినుకే! నీతో చెప్పి, తర్వాత స్టేషన్‌కు వెళ్దామని..."

"ఈమధ్య ఉత్తరం వ్రాసినట్లు లేదే!"

"లేదు...వాడెప్పుడిలాగే చేస్తాడు. పరీక్ష పదిహేనురోజులు వుంది కదూ! సరిగ్గా పరీక్షముందు రోజుల్లోనే రిక్రియేషన్ కావా లంటాడు వాడు!"

"భోజనం ఆలస్యమౌతుందేమో, మీకు కాఫీ కావాలా?"

"తప్పకుండా!"

వంట మనిషితో చెప్పటానికి లోపలికి వెళ్ళింది ప్రసూన.

* * *

ఉన్నట్టుండి వచ్చింది వర్షం, వేణు ఒక్కడే షికారు వెళ్ళాడు. బాగా తడిసి పోయి వుంటాడు అనుకుంది ప్రసూన.

వేణు ఏకాంతాన్ని కోరుతాడు, అన్నగారిలా కాదు. ఆయన కేమో ఎప్పుడూ స్నేహితులూ, కబుర్లూ వుండాలి, లేకపోతే తోచదు. వేణు ముందటి

రెండు సాయంత్రాలు వదినెతో చదరంగం ఆడుతూ గడిపాడు. ఇవాళ ఆమెతో ముందుగా చెప్పనేలేదు 'షికారువెళ్తున్నా' నని. చదరంగం ముందు పెట్టుకొని ప్రసూన నిరీక్షిస్తుంటే, దుస్తులు వేసుకుని తయారై వేణు వరాండాలో నుంచే "అలా వెళ్ళొస్తాను వదినా!" అనేసి గబగబా వెళ్ళిపోయాడు. ఎన్నో విషయాల్ని గురించి లోతుగా ఆలోచించిన ధోరణి వ్యక్తమౌతూవుంటుందే ఏం మాట్లాడినా, మరి యీ చిన్న విషయం, అవతలి వాళ్ళపట్ల తన ప్రవర్తనను గూర్చి, ఎందుకని తట్టకుండా పోయిందో! అతని మీద ప్రసూనకు కోపంవచ్చింది.

అత్తగారికి, ముగ్గురు కొడుకుల్లోనూ చివరివాడని కాబోలు, వేణూ వీడే ఎక్కువ మమకారం. అతనికి ఏమేమి యిష్టమో, అత నేవిషయాన్ని గురించి, ఏ అభిప్రాయం, ఎప్పుడు వెలిబుచ్చాడో అన్నీ సమగ్రంగా చెబుతూ వుంటుంది ఆమె. ఆమె వచ్చిన ప్రతి పర్యాయం యించుమించు వేణుకూడా యింట్లో వచ్చివున్నట్లే వుండేది! అలా పరిచయమైన వ్యక్తిని గూర్చిన కల్పన, మనస్సులో ఏర్పడిన ఊహా చిత్రం, ఎంతవరకు నిజం? అని పరీక్షిందుతోంది ప్రసూన. అత్తగారు చెప్పినవంటలు, ఆ ధోరణిలోనే అన్ని సదుపాయాలు, వేణుకోసం అమర్చి గమనిస్తోంది... ఏదో ఒక నవ్వు, ఒక చూపు, ఒకమాట తళుక్కున మెరసి అప్పుడప్పుడు ఒక ప్రత్యేకతని సూచిస్తున్న మాట నిజమేకాని, మనిషిలో కలుపుగోలుతనం మాత్రం లేదు! ఎదైనా అడిగితే ఒక ముక్కలో సమాధానం, లేకపోతే అదీ లేదు! ఇదంతా కలిసి చివరకు ఒక విధమైన స్వాతిశయమే అనిపిస్తూవుం దామెకు. సిగ్గుపడుతున్నాడేమో అంటే అదేమీ లేదు! నిశ్చలంగా కళ్ళల్లోకి చూచి మాట్లాడుతాడు; ఏమాట చెప్పినా అందులో సంకోచం ఏమీ వుండదు! ఒక తల్లిబిడ్డలే అయినా, ఆమె భర్తలో కనిపించే స్నేహభావం, ఉత్సాహం, చైతన్యం, వేణులో ప్రతిబింబించటం లేదుమరి!

కాని వేణు వర్షంలో తడిసి వస్తాడని ఒక వైపు ఆదుర్దాగా వుంది ప్రసూనకు...గొడుగు పంపించటానికి నౌఖరు వర్షంముందే యింటికి వెళ్ళిపోయాడు. వేణు ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరమని అత్తగా రెప్పుడూ చెబుతూ వుంటుంది!

బాగా తడిసిపోయి యిల్లు చేరాడు వేణు! ప్రసూన హాల్లో సోఫాలో కూర్చుని పుస్తకం చదువుతూ, వేణు రావటం చూచీ చూడనట్లు ఊరుకుంది. వరాండాలో నుంచే ప్రక్కనున్న తన గదిలోకి వెళ్ళిపోయాడు; కొంతసేపటికి బట్టలు మార్చుకుని హాల్లోకి వచ్చాడు. ప్రసూనమాత్రం పుస్తకంమీదనుంచి దృష్టి మరల్చలేదు. ఎగుటవున్న సోఫాలో కూర్చుని, అన్నాడు వేణు :

"బాగా తడిసి పొయ్యాను వదినా!"

ప్రత్యుత్తరంగా ఒక్కక్షణం తలయెత్తి చూచింది ప్రసూన. తడవటం మూలాన కాబోలు అతనిముఖంలో స్నిగ్ధత్వం ఆ కళ్లలో ఏదో క్రొత్త కాంతి తోచాయి. వేణులో ప్రత్యేకత, సౌందర్యం వున్నట్టు అంగీకరించక తప్పదు! అనుకొన్నది ప్రసూన.

"అన్నయ్య యింకా రాలేదా?"

"లేదు!"

"అనుకోకుండా వచ్చింది వర్షం...కుంభవోతగా కురిసింది...సచేల స్నానం!?

"అనుకోకుండా వెళ్లావు, వర్షమూ అలానే వచ్చి వుంటుంది నిన్ను పరామర్శించటానికి!"

వేణు నవ్వాడు. "నువ్వు క్లబ్బుకు వెళ్లావను కున్నాను వదినా!" అన్నాడు.

"నిన్న, మొన్న?"

"నిన్న, మొన్న, క్రొత్తవాణ్ణి, అతిథిని! ఇవాళ కూడా నాకోసం నువ్వింట్లో కూర్చోవటం దేనికి, లేడీస్ క్లబ్బుకి వెళ్తావని, షికారు బయల్దేరాను!"

"అది నిజంకాదు...నువ్వెప్పుడూ అబద్ధం చెప్ప వని మీ అమ్మగారు నొక్కి చెబుతూ వుంటారు మరి!" అని పుస్తకంవైపు దృష్టిత్రిప్పింది ప్రసూన... కొన్ని క్షణాలు, తన్నుతాను పరీక్షించుకొంటున్నట్లు మౌనంగా వున్న వేణు, చివరకు అన్నాడు :

"అబద్ధంకాదు, సగం సత్యం చెప్పాను!"

"ఏమిటి?" అన్న దామె, .ఆ సంగతంతా అప్పుడే మరచిపోయినట్లు.

"నువ్వు క్లబ్బుకు వెళ్తావనుకోవటం ఒక కారణమూ, నాకు ఏకాంతంగా వుండాలన్న కోరిక రెండోకారణమూ. ఈ రెండూ కలిసే నేను షికారు వెళ్లటం జరిగింది...అందువల్ల సగం సత్యం చెప్పా నంటున్నాను."

"తత్త్వశాస్త్రం చదువుతున్నావు కదూ మరి" అన్నది ప్రసూన విసుగు చూపిస్తున్నట్లు.

కారు వచ్చింది. ప్రసూన భర్త లోపలికి వచ్చాడు.

*　　*　　*

వేణుకు జ్వరం వచ్చింది. ఫెడరల్ సర్వీస్ కమీషన్ ఉద్యోగాల పరీక్ష పదిరోజులే వుంది. తమ్ముడు పరీక్షకు వెళ్ళటానికి వీల్లేకుండా పోతుందేమోనని ప్రసూన భర్త ఆందోళన చెందాడు. డాక్టరు మలేరియా అన్నాడు. క్వినైన్ ఇంజక్షన్లు ఇచ్చాడు.

ఆ రోజుల్లో ప్రసూనకు వేణు యింకోవిధంగా కనిపించాడు...ఆమె ఊహించిన 'స్వాతిశయం' అతనిలో అదృశ్యమై పోవటమే కాదు, కొన్నిసార్లు వేణులో వ్యక్తమైన పసితనపు అమాయకత్వం ఆమెకు నవ్వు కూడా తెప్పించింది. ఆమె వేణును గూర్చి తన అభిప్రాయం మార్చుకొన్నది...ఏ విషయం మాట్లాడినా అతని సమక్షంలో ఆమె సొంత భావాలకు ఒక కొత్త విలువ వస్తోంది! ఒకానొకప్పుడు పుస్తకాలు చదివి తోటి విద్యార్థినులతో ఎన్నో సంగతులు ఉత్సాహంతో చర్చించే ఆమె ప్రాత అనుభూతి తిరిగి వచ్చినట్లుంది:

"జీవితం ఎందుకు పేలవమై పోతుంది?"

"తీరిన కోరికలవల్ల"

"అయితే ఏం చెయ్యాలి?"

"కొత్తకోరికలు కోరుకోవాలి!"

వేణు సూచించిన జవాబు చాల విడ్డూరంగా తోచింది ప్రసూనకు!

"బాగుంది, అవి ఆసక్తిబగులు ఆవేదనని కలిగిస్తాయి కదా! కోరికల్ని జయించి, శాంతిని సాధించమనేకదా తత్వబోధ! కొత్తకోరికల్ని పెంచుకుంటే ఏమౌతుంది?"

"భౌతికంగా సాధ్యమయ్యే కోరికలు ప్రయత్నం మీద వాటిమార్గం అవి చూచుకొని ఏమైనాసరే గమ్యం చేరుకొంటాయి...భౌతికంగా సాధ్యం కానివి, లేక మనలోని బుద్ధివల్ల, నిగ్రహశక్తివల్ల కట్టుబడేవి చివరకు—అంటే ఎంతకాలంలో, ఏవిధంగా అనేది వ్యక్తినిబట్టి వుంటుంది—చివరకు సత్యరూపంతో శాంతిని, ఆనందాన్ని ప్రసాదించగలుగుతాయి! అంతేగాని, కోరికల్ని చంపటం, అణచటం, విస్మరించటం, యిదంతా భావవల్ల, ఊహవల్ల కలిగే పొరబాటు! దానికి కారణం భయం; భయమూ నిగ్రహమూ ఒకటి కాదు; భయంవల్ల లభించేది మృతి; నిగ్రహంవల్ల సాధ్యమయ్యేది ఆనందం...కాబట్టి కోరికల అశాంతిని పూర్తిగా అనుభవించటమే జీవితంలో ఆసక్తికి మూలం అంటాను...అందుకే క్రొత్త కోరికలు పెంపొందాలి అన్నాను..."

"నువ్వు చెప్పేది నాకేం అర్థం కావటంలేదు వేణూ! పుస్తకాల్లో చదివినదానికి నీ సొంత వ్యాఖ్యానం కాబోలు యిదంతా!" అన్నది ప్రసూన.

*　　*　　*

ఒకనాడు వేణు పెళ్ళి ప్రస్తావన వచ్చింది:

"ఉద్యోగం ఎలానూ వస్తుందికాని, నువ్వెలాంటి అమ్మాయిని కోరుతావో, ఎంతకట్నం, ఏ చవిటి కావాలో ఇప్పుడే కాస్త చెప్పిపెట్టితే ఎందుకైనా మంచిది వేణూ!" అన్నది ప్రసూన.

"ఎలాంటి అమ్మాయైనా సరే!" అన్నాడు.

"అచ్చంగా వేదాంతిలా మాట్లాడుతున్నావే! కోరికలు కోరటం మంచిదని నువ్వే అంటావు మళ్ళీ... కోరుకోవటానికి సిగ్గెందుకూ? అమ్మాయి ఎలా ఉండాలో చెప్పు ఊహించి!"

"నీవలె వుండాలి వదినా!"

"ముఖస్తుతి అక్కర్లేదు, చెప్పు!"

"నాకింకేం తోచటంలేదు. ఇప్పుడెందుకా గొడవ, దయచేసి ఊరుకో వదినా" అన్నాడు.

ప్రసూన వెళ్ళిపోయింది. తర్వాత రెండు రోజులు ఆమె వేణుతో ఎక్కువగా మాట్లాడలేదు; వ్యక్తిగతమైన ప్రశ్నలు వేయటం అసలు మాని వేసింది.

వేణుకు జ్వరం తొందరగానే నయమైంది. కాని నీరసంగా వున్నాడు. ఢిల్లీకి ప్రయాణమయ్యాడు. 'నౌకర్ని వెంటపంపితే బాగుంటుందేమో' అన్నది ప్రసూన. ఆమె భర్త ఢిల్లీలో తన స్నేహితుల యింటికి వేణుని వెళ్ళమని ఏర్పాటు చేశాడు.

వేణు వెళ్ళినతర్వాత ప్రసూనకు జీవితంలోని అర్థరాహిత్యం మళ్ళీ తీరని సమస్యగా గుర్తుకువచ్చింది. మరది రావటంతో, ఆ సందడిలో కొన్నాళ్ళు ఆ విషయం అప్రయత్నంగా మరచిపోయిందామె. భర్తకు తత్వజిజ్ఞాస పట్టదు; ఏ విషయాన్ని గూర్చి కాని లోతుగా ఆలోచించటం, తర్కించటం హాస్యాస్పదంగా కనిపిస్తుంది ఆయనకు...కనిపించేది లోకం,

జరిగేది జీవితం, అంతకుమించిన ఊహాలు నమ్మకాలు అనవసరం ఆయన దృష్టిలో...వేణు భావుకుడు, తాత్వికుడు, ప్రతివిషయాన్నిగూర్చి ఏదో పరీక్ష చేస్తాడు, అన్వయంకోసం వెదుకుతాడు...నిజానికి సోదరులుముగ్గురూ ముగ్గురే! అనుకొన్నది ప్రసూన. సైన్సు, గణితం తీసుకుని పరీక్షలు ప్యాసై, ప్రావిన్షల్ సర్వీస్‌లో డిప్యూటీ కలెక్టరుగా సెలెక్టయ్యాడు ప్రసూన భర్త. పెద్దమరది మద్రాసులో తండ్రిదగ్గరే లాయరుగా వున్నాడు. ఇక వేణు, వేదాంతం, చరిత్ర, సాహిత్యం ఎన్నుకొని ఫెడరల్ సర్వీసస్ పరీక్షకు వెళ్తున్నాడు. రేపో మాపో పోస్టల్‌లోనో, రైల్వేలోనో పెద్ద ఉద్యోగి అవుతాడు!

అన్నదమ్ములు వాదిస్తూవుంటే వినాలి! జగత్తు రహస్యం, వాస్తవిక ప్రపంచాన్ని హేతువాదాన్ని మించి, తెలుసుకోవటానికి వీల్లేదంటాడు అన్న. హేతువాదాన్ని అధిగమిస్తేకాని ఆ విషయం తేలదంటాడు వేణు. "ఏవిధంగా?" అంటేమాత్రం దానికి సమాధానం, వివరణ, సాధ్యంకాదనీ, అన్నగారిని అంగీకరింపచెయ్యటం తనచేత కాదనీ అంటాడు వేణు...ఒక కోరికను కోరటం, దాన్ని నిగ్రహించటం ఈ విరుద్ధప్రవృత్తులమధ్య కలిగే హృదయానుభూతిలో అందుకు ఏదో మార్గం వుందని తనకు తోస్తోందనీ, దాని స్వరూపం తనింకా అవగతం చేసుకోలేదనీ అన్నాడు, జ్వరం వచ్చినప్పుడు ఒకసారి ప్రసూనతో వేణు. ఆ మాట భార్యద్వారా విని, "ఉద్యోగంవచ్చి పెళ్లైతే, యీ పిచ్చివేదాంతం వదుల్తుందిలే" అన్నాడు వేణు అన్న. మొత్తానికి వేణు విచిత్రవ్యక్తి అనుకొన్నది ప్రసూన!

పరీక్షలు పూర్తికాగానే సరాసరి తిరిగి రమ్మనీ, తర్వాత మద్రాసు వెళ్ళవచ్చుననీ చెప్పారు దంపతులిద్దరూ. కాని ఢిల్లీ వెళ్ళి వేణు ఉత్తరం వ్రాశాడు: పరీక్షలు కాగానే మద్రాసు వెళ్ళి రెండురోజులుండి, తర్వాత ఒక స్నేహితునితో కలిసి దక్షిణదేశం తిరిగి రావాలని సంకల్పించాడట; దక్షిణదేశయాత్ర తర్వాత అన్నదగ్గరకు వస్తాడట!

తర్వాత ఉత్తరాలు లేవు! అతను పుదుచ్చేరి అరవిందాశ్రమంలో కొన్నాళ్ళు, రమణాశ్రమంలో కొన్నాళ్ళు వున్నట్టూ, దక్షిణాదిలో ముఖ్యమైన స్థలాలన్నీ దర్శించినట్టూ మద్రాసునుంచి కబురుమాత్రం తెలిసింది. రెండునెలల తర్వాతకాని వేణు మద్రాసు చేరుకోలేదు. అప్పుడే ప్రసూన భర్తను బదిలీచేసి బళ్ళారి వేశారు. ప్రసూన పుట్టింటికి వెళ్ళింది. ఆమె బళ్ళారికి తిరిగివచ్చినతర్వాత భర్త వేణుని రమ్మని ఉత్తరం వ్రాశాడు. ఈ మధ్యకాలంలో వేణు మద్రాసులో ఒక కాలేజిలో లెక్చరరుగా చేరాడట; అందువల్ల సెలవుల్లోకాని రావటానికి వీలుండదని బదులు వచ్చింది! ఫెడరల్ సర్వీసస్ ఫలితాలకైనా వేచివుండకుండా యింతలో యీ ఉద్యోగమేమిటని, భార్యాభర్తలిద్దరూ ఆశ్చర్యపడ్డారు. దానికి ప్రత్యుత్తరమిచ్చాడు వేణు: "...ఫలితం ఏమౌతుందో, ఊరుకోవటం దేనికని లెక్చరరు ఉద్యోగం చేస్తున్నాను... ఈసారి సెలవుల్లో వచ్చినప్పుడు నాకు పెళ్లిసంబంధం చూడమని వదినెతో చెప్పాలి...క్రిందటిమాటు, నాకు ఉద్యోగం రాగానే అమ్మాయిని వెదికిపెట్టుతానన్నది వదినె!"...అయితే వేణు సరియైన ధోరణిలోనే వున్నాడన్నమాట! పుదుచ్చేరి, అరుణాచలం, యివి ప్రసూనను, ఆమె భర్తను కలవరపెట్టాయి...వేణు వ్రాసిన ఉత్తరం ఆ సందేహనివృత్తి చేసింది!... తెలిసినవాళ్లలో తగిన అమ్మాయి ఎవరా? అని ప్రసూన ఆలోచించటం ప్రారంభించింది...నీవలె వుండాలి వదినా!" అని వేణు అన్న మాట జ్ఞాపకం వచ్చి, ఆమెకు మరదిమీద ఏదో క్రొత్త అభిమానం కలిగింది.

*　　*　　*

డిసెంబరులో తల్లిని తీసుకుని వేణు బళ్ళారి వచ్చాడు. ఢిల్లీ ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు వచ్చిందట. పది రోజుల్లో వెళ్ళాలి.

"ఏదో పరీక్షో, ప్రయాణమో ముందుపెట్టుకొనిగాని, ఊరికే రాగూడదేమిటి?" అన్నది ప్రసూన.

"జ్వరం వస్తుందేమోనని భయం!" అన్నాడు వేణు.

ప్రసూన నవ్వింది. "అందుకే కాబోలు యీసారి అత్తయ్యను వెంట దీసుకొచ్చావ్!"

"అమ్మ హంపీ చూడాలట...మీరింకా వెళ్ళలేదుగా, అందరం కలిసి వెళ్ళొద్దాం" అన్నాడు వేణు.

తీరా ప్రయాణమయ్యేటప్పటికి ప్రసూన భర్తకు ఆఫీసుపనులేవో అడ్డువచ్చాయి. మిగిలిన ముగ్గురూ

డ్రైవరుతో కారు తీసుకుని బయల్దేరారు.

విరూపాక్ష దేవాలయంలో తిరుగుతూ వుండగా వేణు అన్నాడు: "మొట్టమొదటి సారిగా ఈ ప్రదేశంలో అడుగు పెట్టుతున్నా, ఎందుకనో ఈ కట్టడాలు, శిల్పాలు, పరిసరాలు నాకు చిరపరిచితా లన్న అనుభూతి కలుగుతోంది వదినా!"

"బహుశా ఫోటోల్లో ఈ కట్టడాలు చూచి వుంటావు! చరిత్ర చదివి ఊహించుకొని వుంటావు, అదంతా జ్ఞాపకం వస్తోంది కాబోలు" అన్నది ప్రసూన.

"అలా కాదు. రోజూ మనం నడిచే వీధి, తరచు వెళ్ళే దేవాలయం, పాల్గొనే పూజలు, హరికథలు, ఉత్సవాలు—యివి కొన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ ఆ చోటికే తిరిగివస్తే మనకెంత గాఢంగా జ్ఞాపకం వస్తాయో, అలాగే యీ హంపీ బజారు, ఈ దేవాలయాలు ఇంత శూన్యంగా, నిర్జనంగా కనిపిస్తూ వున్నా, మనుష్యులతో ఉత్సవాలతో సందడిగా కళకళలాడుతూ వున్నట్టు ఏదో భ్రమ కలుగుతోంది. నాకు...నిజం చెప్పాలంటే పూర్వజన్మలో నే నిక్కడ రాయల సైన్యంలో ఒక సరదారు నైనట్లు గట్టిగా నమ్ముతున్నాను!"

"బాగుంది...అయితే విజయనగర ప్రజలజీవితాన్ని వర్ణిస్తూ ఒక చక్కని నవల తయారు చేయవచ్చునే! ఊహాశక్తి అంత గాఢంగా వుంటే... అత్తయ్యా, మీ అబ్బాయి ఏదో పూర్వ జన్మలో యిక్కడ సర్దారుగా రాయలవారి సైన్యంలో వుండే వాడట!"

"సరదా రేమిటి, సైన్యాధ్యక్షుడే అయివుంటాడు! అమ్మాయ్, పూర్వజన్మస్మృతి అంటే అందులో ఆశ్చర్యపడవలసిం దేమీ లేదు...నా చిన్నతనంలో ఒకసారి మా యింటికి ఒక యోగివచ్చాడు..." వేణు ఏం చెప్పినా అది అందరూ అక్షరాలా నమ్మాలి! దాన్నెవరైనా శంకించటం ఆమె సహించలేదు; పూర్వ జన్మస్మృతుల్ని గూర్చి ఏవో కథలు చెప్పింది ప్రసూన అత్తగారు.

ప్రసూన వింటూ నడుస్తోంది. వేణు కొంచెం ముందున్నాడు. హంపీ బజారుదాటి కోదండరామ దేవాలయందరికి నడుస్తుంటే, వేణు చప్పున నిలిచిపోయాడు. ఎడమవైపున తుంగభద్రను చూపి అన్నాడు: "ఇక్కడినుంచీ నదీ, యీ పరిసరాలు, యీదృశ్యం నాకు మరీగాఢమైన స్మృతిగా వుంది... ఇక్కడ నిల్చొని ఎన్నోసార్లు ఎవరితోనో మాట్లాడినట్లు నా ఊహ!"

ప్రసూన నవ్వుతూ అన్నది: "తర్వాత మాట్లాడవచ్చు; విఠ్ఠలదేవాలయం యింకా చాలదూరం వుందట...తిరిగి వచ్చేటప్పుడు మాట్లాడరాదూ!"

విఠల దేవాలయం చూచినతర్వాత హాస్పేట తిరిగివచ్చారు ఆ రోజు.

మరుసటిరోజు హజార రామస్వామి దేవాలయంలో, రామాయణగాథ చెక్కబడిన కుడ్య శిల్పాన్ని చూస్తూవుంటే, వేణు ఒక చిత్తరువు ముందు నిల్చుని కదలకపోవటం గమనించి, కౌతూహలంతో దగ్గరకు వెళ్లింది ప్రసూన...సీత పర్ణ కుటీరంముందు నిలబడి, బంగారు లేడి వైపు చూపిస్తూ 'అది తనకు కావా'లంటూ వుంది శ్రీరామునితో. తర్వాత చిత్రం, రాముడు ఆ లేడిమీద బాణం వేయటం!

"ఆ లేడి ఎంత బాగుంది!" అన్నది ప్రసూన.

వేణు మాట్లాడలేదు. రెండుమూడు చిత్రాలు దాటివెళ్ళిన ప్రసూన వేణుతో: "ఆ లేడిమీద వ్యామోహమే కలగకపోతే సీతకు అంత అనర్థం వాటిల్లేది కాదుకదా!" అన్నది.

వేణు ఆమె దగ్గరకు నడిచాడు: "అలా కాదు వదినా! సీత కారణ జన్మురాలు...సీతా రాములిద్దరూ కూడా రావణ సంహారంకోసమే జన్మించారు. అందువల్ల కాలాన్నిబట్టి కనిపించే హేతువులూ, మంచి చెడ్డలూ ఒక రకంగా వుంటే, కాలాతీతమైన హేతువులూ, మంచి చెడ్డలూ ఇంకోరకంగా వుంటాయి!"

"ఏమిటో వేణూ! ఇక్కడకూడా వేదాంతమేనా?"

గజశాల, దసరాదిబ్బ దర్శించటానికి వెళ్తున్నారు; వేణు అన్నాడు: "సర్దారు వృత్తాంతం చెప్పనా?"

"సర్దా రేమిటి?"

"మరచి పోయావా వదినా! నా పూర్వజన్మకథ!"

"ఆఁ, అవును, చెప్పు! పూర్తిగా జ్ఞాపకం వచ్చిందేమిటి?" అన్నది ప్రసూన చిరునవ్వుతో.

"ఆ సర్దారు ఒక యువతిని—పువ్వలావికను—ప్రేమించాడు...మొదటిసారి విరూపాక్ష దేవా

లయంలో, తర్వాత హంపీ బజారులో, తుంగభద్ర ఒడ్డున ఆమెను కలుసుకున్నాడు...ఆ ప్రేమబంధం నాగపాశంలాంటిది...దానిలో అతను పూర్తిగా కట్టుబడిపోయాడు...ఒక నాటి వర్షపు రాత్రి ప్రేయసి మీది వ్యామోహం నిగ్రహించుకోలేక, రోగశయ్యమీద మరణావస్థలో వున్న తల్లిని వదలి వెళ్లాడు...వెళ్ళాడు కాని అతని హృదయంలో పూర్వార్ధానికి, ఉత్తరార్ధానికి సంఘర్షణ...తెల్లవారే సరికి తల్లి మరణించింది...పశ్చాత్తాపం...—తర్వాత రాయలవారి జైత్రయాత్ర...సర్దారు యుద్ధభూమికి వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి ఏడాది దాటింది...పుష్పలావిక జాడ లేదు...హంపీ బజారులో రెండేళ్ళ క్రితం కనిపించాడొక విదేశీవర్తకుడు, ఆమె దగ్గర పువ్వులుకొనేవాడు, అతణ్ణి పెళ్ళిచేసుకొని వెళ్ళిపోయిందని విన్నాడు...జీవితం శూన్యమనిపించింది..."

"తర్వాత ఏమైంది?"

"తెలీదు."

"కథ రొమాంటిక్ గా వుంది; కాని ముగింపునే చెప్పనా?...చాల వాస్తవిక దృష్టితో...ఇంకో అమ్మాయిని పెళ్ళిచేసుకొని పదిమంది పిల్లల తండ్రి అయ్యాడు...సైన్యాధ్యక్షుడయ్యాడు!"

ప్రసూన చెప్పిన ముగింపు మాత్రం చెవినిబడ్డ వేణుతల్లి "ఏమిటా కథ? నన్నూ విననీయండి!" అన్నది.

'మీ అబ్బాయి పూర్వ జన్మకథ, అత్తయ్యా!" అంటూ ప్రసూన వేణు చెప్పినకథ ఆమెకు చెప్పింది.

"అందుకే కాబోలు; నేనెప్పుడూ తనతోటే వుండాలని యిష్టపడతాడు వేణు! నన్ను కూడా తనతో ఢిల్లీ తీసుకు వెళ్తానంటున్నాడీ మాటు!"అన్నది నవ్వుతూ తల్లి.

"అయితే మీరూ ఢిల్లీ వెళ్తారన్నమాట! చెప్పనే లేదే!" అన్నది ప్రసూన ఆశ్చర్యంగా.

"నువ్వూ రావే అమ్మాయ్! కాశీ, ప్రయాగ చూచివద్దాం...నువ్వు పుణ్యతీర్థాలు సేవిస్తే మనవడు తప్పకుండా పుట్టుతాడు" అన్నదామె.

భూగర్భ దేవాలయందగ్గరకు వచ్చారు. అంగులో చూచేదేమీ లేదన్నారు వెంటవచ్చినవాళ్లు...వేణు తను వెళ్ళి చూడాలన్నాడు. ప్రసూన "నేనూ వస్తా" నన్నది. రాయల ఆలోచనా మందిరానికి భూగర్భ దేవాలయానికి సొరంగమార్గం వుండేదట పూర్వం...

వేణు తల్లి రోడ్డుమీదే వుండిపోయింది...వేణుముందు, ప్రసూన అతని వెనుక, మెట్లు దిగి ముందు ఆవరణ దాటి లోపలికి వెళ్ళారు గర్భగుడిదాకా... అంగులో నీళ్ళు నిలిచి లోతుగా వున్నట్లు కనిపించింది, తర్వాత అంధకారం...వేణు గర్భగుడి కుడివైపుకు మళ్లాడు, ప్రసూన అతని వెనుకనే వుంది..."అమ్మో, పాము!" అని అరవబోయిన ప్రసూన గొంతు సగంలో ఆగిపోయి, చప్పున వేణుని గట్టిగా చుట్టుకొని, ముఖం అతని వీపున దాచుకొన్నది...వేణు పామును చూచి కదలకుండా నిలిచిపోయాడు...రెండుమూడు గజాల దూరంలో పడగఎత్తి నిలుచున్న త్రాచు, పడగ దించి సరసరా వెళ్ళిపోయింది!

"వదినా, వెళ్ళిపోయింది పాము!" అన్నాడు వేణు.

ప్రసూన తేరుకోవటానికి కొన్ని క్షణాలు పట్టింది. ఆమె దేహం వణుకుతోంది...ముఖాన చెమట...వేణు చెయ్యిపట్టుకుని మెట్లదాకా నడిపింది.

"అబ్బ! ఎంత గండం తప్పింది వేణూ! ఈ పాడు దేవాలయంలో ఏముందని వచ్చాం యిక్కడికి!" అన్నదామె.

వేణు మాట్లాడలేదు.

"అత్తయ్యా, త్రాచుపాము! నా ప్రాణాలు నిలువునా ఎగిరిపొయ్యాయి...వేణుకు ఎంత ధైర్యం! నిశ్చలంగా నిలుచున్నాడు" అని చెప్పింది అత్తగారితో ప్రసూన.

ఆ సంఘటన ఆమె మనస్సుమీద చెరగని ముద్ర వేసింది. తను అంతగా భయపడిపోవటం, వేణు వదురూ బెదురూ లేకుండా నిల్చోవటం, రెండూ ఆశ్చర్యాన్ని కలిగించాయి. తలచుకొన్నకొద్దీ తన ప్రవర్తన తనకే సిగ్గు తెప్పిస్తోంది. వేణు ఏమనుకొన్నాడో మరి! తను వేణూను అలా పట్టుకొని కళ్లు మూసుకోవటమేమిటి పసిపిల్లలా!...అప్పటినుంచి వేణు కొంచం ముభావంగా వున్నట్టుకూడా అనుమానించింది ప్రసూన.

బళ్ళారికి తిరిగివస్తూంటే, కారులో వేణు మౌనం భారంగాతోచి, ప్రసూన అన్నది. "త్రాచు పామును చూస్తే మనిషికి ఎందుకో అంత వెర్రిభయం?"

"విషజంతువుకదూ! కరిస్తే యింకేమన్నా వుందా!" అన్నది వేణు తల్లి.

"విషజంతువు లెన్ని లేవు! త్రాచును చూస్తే అంత విపరీతభయం ఎందుకో అర్థంకాదు!" అన్నది ప్రసూన తన్ను తాను నిరసించుకొంటున్నట్లు.

"దానికి కారణం త్రాచుపాములోవున్న విశిష్టత! సౌందర్యము, శక్తి, చైతన్యము, మృత్యువు యివన్నీ త్రాచుపాములో మూర్తీభావం పొందుతాయి వదినా! మన మనస్సులో మృత్యుభావనకు సౌందర్యం, చైతన్యం లేదు; అలాగే సౌందర్యభావనకు మృత్యుసంబంధం లేదు... కాని యీ భిన్నప్రవృత్తుల సంఘర్షణ, కాదు సమీకరణ, ఒక్కత్రుటిలో మన అనుభూతికి తెస్తుంది త్రాచుపాము. ఆ అనుభూతి అసామాన్యమైనది, అందుకే అది వెఱ్ఱిభయం! యోగవిద్యలో కుండలినీశక్తికి సర్పరూపాన్ని మనవాళ్ళు నిర్దేశించటానికికూడా యిదే కారణమనుకుంటాను!"

వేణువి అన్నీ విచిత్రమైన వ్యాఖ్యానాలు, అనుకొన్నది ప్రసూన. కాని పాముఎదుట అతని ప్రవర్తన చూచినతర్వాత, అతని మాటల్ని నిర్లక్ష్యం చేసి ఏదో అనలేకపోయింది ఆమె. హంపీలో వేణు చెప్పిన కథనుగూర్చి మళ్ళీ ఆలోచించింది. సరదాకు చెప్పిన కథ అని యిదివరకు అనుకున్నా, అందులో కూడా వేణు ఏదో అర్థాన్ని వుద్దేశించే వుంటాడనిపించింది ఆమెకు...ఇల్లు చేరుకున్న తర్వాత, హంపీ విశేషాల్ని భర్తతో చెబుతూవుంటేమాత్రం, వేణు మాటలన్నీ పిచ్చివేదాంత ధోరణిగా తోచాయి ఆమెకు...కథంతా విని భర్త నవ్వాడు; "తొందరగా వేణుకి పెళ్ళి చెయ్యటం ముఖ్యమని తెలుస్తూందికదా!...కాలేజిలో ఏ అమ్మాయినో ప్రేమించి నిరాశ చెంది వుంటాడు" అన్నాడు.

* * *

"వేణూ, నువ్వెవరినైనా ప్రేమించావా?" అని సూటిగా ప్రశ్నించింది ప్రసూన తర్వాత. ఒక్క క్షణం "ఎందుకు?" అన్నట్లు చూచి, "ఆఁ... పుష్పలావికను!" అని సమాధానమిచ్చాడు వేణు.

"తమాషా కాదు!...నిజంగానే చెప్పు!"

"నిజంగానే వదినా!...ఆనాడు నాకు ఊహాపథంలో మెదిలిన కథకూ నా మనస్సుకూ అవినాభావ సంబంధం వున్నట్లు, తిరిగివచ్చినతర్వాత గ్రహించాను...సీత బంగారులేడి తనకు కావాలంటుంది; దాన్ని బాణంవేసి చంపితేతప్ప అది దొరకదు; చంపటంతో మరి దాని స్వరూపమే మారిపోతుంది...సౌందర్యాన్ని పొందటం దాన్ని పోగొట్టుకోవటమే!...సీత లేడిని చూచి ఆనందించిన క్షణమొక్కటే అమృతక్షణం! 'అది ఎంత అందంగా వుంద'న్నతృప్తి, 'అది తనది కాదే' అన్న అసంతృప్తి, ఈ రెండూ సమంగా నిల్చిన క్షణం! కాని తర్వాత క్షణంలో 'అది తనది కాదే' అన్నభావం జయిస్తుంది, సీత శ్రీరామునికి తన కోరికను చెబుతుంది, ఇక కార్యకారణ సంబంధంతో కాలం అలా కదలిపోతుంది; దానితో సౌందర్యమూ చేజారిపోతుంది!...కాలాన్ని, కార్యకారణ సంబంధాన్ని అధిగమించే సత్యం, రెండు విరుద్ధప్రవృత్తుల సమీకరణ!...పుష్పలావిక—సౌందర్యం; తల్లి—ధర్మం...వానవచ్చినరాత్రి పుష్పలావికకోసం సర్దారు తహతహలాడిన క్షణం సౌందర్యం, ధర్మం సమీకరణ చెందిన అమృతక్షణం!"

"అయితే సౌందర్యంమీది కోరికను నిగ్రహించుకొని, సౌందర్యాన్ని పొందకపోవటమే కర్తవ్యం అంటావా?"

"అది కూడా కాదు! ఆ అనుభూతిలో, నిగ్రహించుకోవటంలోని అసంతృప్తి వుండదు, అలా అని కోరిక ఉద్ధృతమూ తగ్గదు...అది భాషకు మామూలు ఊహకు అతీతమైన సత్యం. పొందకుండా పొందటం, పొందీ పొందకపోవటం అనాలి; కాని అంటే అది అర్థరహితంగానే తోస్తుంది! మాటలో, ఊహలో కాదు, ప్రత్యక్షానుభూతిగామాత్రం అది సత్యం! సాధారణమైన జీవితానుభూతి—కోరటం, పొందటం, కోరటం—యిలా వుంటుంది ఎగుడుదిగుడుగా నిరంతర ప్రయాణంచేసే తరంగంలా. అది అలా కదలిపోతూ వుండటమే జీవనసరళి, కాలప్రవాహం! కాని మనిషిలోని ఏదో విశిష్టత అతణ్ణి ఊరుకోనివ్వదు...కోరటంలో నిలిచి బాధపడుతాడు, లేక పొందటంలో పడిపోయి అంతా పేలవం అనుకుంటాడు...విముక్తిమార్గం తరంగంతో కదలిపోతూవుండటం ఒకటి; లేకపోతే తరంగాన్ని అధిగమించే ద్వంద్వాతీతమైన అనుభూతి యింకోమార్గం...నేను చెప్పిన విరుద్ధప్రవృత్తుల సమీకరణ ద్వంద్వాతీతమైన అనుభూతి!"

ప్రసూన ఆలోచిస్తూ కూర్చున్నది. ఆమె కేమీ బోధపడలేదు... వేణు వేదాంతం సంగతి ఎలావున్నా, అసలు వేణూను వ్యక్తిగా ఎలా అర్థం చేసుకోవాలో ఆమెకు అంతుపట్టటంలేదు... వేణు మాటల అర్థాన్ని ఆమె తరచటంలేదు; కాని సౌందర్యాన్నిగూర్చి, జీవితాన్నిగూర్చి యిలా గాఢంగా, మధురంగా, గంభీరంగా మాట్లాడే వేణూను ఒక అమ్మాయి ఎలా ప్రేమించాలో, ఆ అమ్మాయి ప్రకృతి ఎలా వుండాలో ఆలోచిస్తోంది.

"వేణూ! నీకు తగిన భార్యను వెదకటం చాల కష్టమైన కార్యమే!...అయినా ప్రయత్నిస్తున్నాను. చాల అందంగా వుండాలి కదూ!...నీతో తత్వజిజ్ఞాస చేసేటట్టు కూడా వుండాలి కాబోలు!"

"నీవలె వుండాలి వదినా!"

"నే నెందుకు పనికి వస్తాను బాబూ!" అని ప్రసూన లేచి వెళ్ళింది కలవరపాటుతో.

*   *   *

హంపీ వెళ్ళి వచ్చిన బడలికతో అస్వస్థురాలైన వేణుతల్లి ఢిల్లీ ప్రయాణం మానుకోవలసి వచ్చింది. వేణు ఒక్కడే ఢిల్లీ వెళ్లాడు.

ఇంటర్వ్యూ తృప్తికరంగా వుందనీ, తను కాశీ, హరిద్వారంచూచి పదిరోజుల్లో తిరిగి వస్తావనీ వేణు అన్నగారికి ఉత్తరం వ్రాశాడు.

పదిరోజులు పదిహేనై, ఒక నెల గడిచింది. మళ్ళీ ఉత్తరం రాలేదు. మద్రాసుకు వ్రాశాడేమో అనుకున్నారు; కాని వాళ్లకూ వేణు వార్త ఏమీ తెలీదు. వేణుతో ఢిల్లీ వెళ్ళిన స్నేహితుడు వేణు పేర మద్రాసు వ్రాసిన రెండు వుత్తరాలు మాత్ర చేరాయి. వేణు సెలెక్ట్ అయినట్లు ఫెడరల్ సర్వీస్ కమీషన్ వారు తెలియజేశారు కూడా! వేణు ఏమైనట్లు? వేణుకువచ్చిన వుత్తరాలు చదివి, వేణు స్నేహితుణ్ణి కనుక్కున్నారు. కాశీకి తనూ వెళ్ళాననీ, తర్వాత హరిద్వార్ కు వేణు ఒక్కడే వెళ్ళాడని మాత్రమే అతను చెప్పగలిగాడు. ప్రసూనభర్త హరిద్వార్ వెళ్ళి తిరిగివచ్చాడు...వేణు జాడలేదు! పత్రికల్లో ప్రకటించారు, రిపోర్టిచ్చారు, వేణునుగూర్చి ఏవిధమైన వార్తాలేదు!

భర్త నిరాశతో తిరిగివచ్చినరోజు ప్రసూన దుఃఖం అపుకోలేక పోయింది..."నదిలో పడి పోయ్యాడో, ఏమయ్యాడో నాతండ్రి!" అని వేణు తల్లి విలపించింది...కాని ప్రసూనకు ఆ అభిప్రాయం లేదు. "లేదు! వేణు హిమాలయ పరిసరాల్లో నే ఎక్కడో వున్నాడు...వేణు తప్పకుండా తిరిగి వస్తాడు!"అన్నది ప్రసూన.

విచిత్రమైన వ్యక్తి వేణు! అతని మూర్తి, అతని మాటలు, అభిమానం, నిత్యస్మృతులు ప్రసూనకు. అతని జాడ ఎప్పుడో తెలిసి తీరుతుందన్న ఆశ ప్రసూనకు జీవితంమీద కొత్త ఆసక్తిని పెంపొందించింది.

...ఇరవై ఏళ్ళు గడిచాయి వేణు అదృశ్యుడై! సన్నజాజుల పందిరి కళకళ లాడుతూవుంది..."అలా వెళ్ళొస్తానమ్మా" అని గబగబా వెళ్ళిపోతున్నాడు వేణు! పంతొమ్మిదేళ్ల కొడుకు మాటకు ఉలికి పడి, 'వేణు అమృతుడు' అనుకొన్నది ప్రసూన.